


మయూరి వీక్లీ, 11 జూన్, 1993

ఆఫీసు నుండి ఇంటికి వచ్చి తలుపు తట్టాను.

తలుపు తీసిన శైలజను చూస్తూ-

"ఏమిటీ... వీధి చివర ఏదో జరుగుతున్నట్లుంది?" అన్నాను కుతూహలంగా.

"అదంతా ఓ పెద్ద కథ! ముందు మీరు లోపలికొచ్చి కాఫీ త్రాగండి. నేను తీరిగ్గా చెబుతాను" అంటూ లోపలికి దారితీసింది.

ముఖం కడుక్కొని, సోఫాలో కూర్చుని, శైలూ అందించిన కాఫీ సిప్ చేస్తూ..."ఇప్పుడు చెప్పవోయ్ః... ఆ పెద్ద కథేంటో?!" అన్నాను.

తానూ నా ఎదురుగా కూర్చుంటూ– "కాలం ఎలా అయిపోయిందో చూడండి! ప్రక్కవీధిలో ఉంటున్న ఓ అమ్మాయి కాలేజీ నుంచి ఇంటికి మన వీధిలోంచి వెళ్తాంటే ఓ నలుగురు కుర్రాళ్ళు ఆమెతో అసభ్యంగా మాట్లాడుతూ టీజ్ చేశారట. ఆ అమ్మాయి కోపంతో ఇంగ్లీషులో చెడమడా తిట్టిందట. వెంటనే వాళ్లు ఆమె-పైకి దూకారట. ఆమె దగ్గరలోవున్న ఇంటిలో దూరి తలుపేసుకుంది. ఇప్పుడు ఆమెను బయటకు రమ్మని, వచ్చేవరకు కదలమని అక్కడే తిష్టవేసుకు కూర్చున్నారు ఆ నలుగురూ. దీన్ని ఎదిరించడానికి ధైర్యంలేని పెద్ద మనుషులందరూ ఓ సినిమా షూటింగు చూస్తున్నట్లు చూస్తున్నారు... చూడండి!" అంది.

"నిజమే! అయినా... తెలిసి తెలిసీ ఆ రౌడీలతో ఎవరు తగాదా పెట్టుకుంటారు చెప్పు?" అన్నాను.

"అయితే ఈ దురాగతాలకు అంతం అంటూ లేదా చెప్పండి? ఈరోజు జరిగింది రేపు మన కూతురికి జరగదన్న గ్యారంటీ ఏమిటి?" అంది శైలు ఆవేశంగా.

"అలాగని ఈరోజు మనం కలగజేసుకుంటే ఆ పనేదో ఇప్పుడే చేస్తారు."

"హుఁ... రోజురోజుకీ మనం ఎంత పిరికివాళ్ళమయిపోతున్నామండీ?! రేపు నాకేమవుతుందో, నావాళ్ళ కేమవుతుందో... అన్న భయమే ప్రజలకు లేకుంటే ఈ సమాజంలో ఇన్ని రేప్‌లు, ఇన్ని చిత్రహింసలు లేకుండా ఆడవాళ్ళు హాయిగా, నిర్భయంగా తిరిగేవారు కదా!" బాధగా అన్నది.

"డోంట్ బీ సీరియస్ శైలూ! ఇది నీ ఒక్కదాని ఆలోచనే కాదు. చదువు, సంస్కారం ఉన్న ప్రతి ఒక్కడి ఆలోచన ఇదే! కాని, ఈ సమాజంలో భద్రత ఎవరికుంది చెప్పు? జీవితం సినిమా కాదు. ఇరవైమంది పైనబడినా– బట్టలు నలక్కుండా అందర్నీ చితక్కొట్టడానికి!" అన్నాను.

క్షణక్షణానికి అక్కడేం జరుగుతోందో చూడాలన్న ఆసక్తి పెరగసాగింది నాలో.

"నేనలా వెళ్లొస్తాను... తలుపేసుకో!" అంటూ లేచాను.

"ఏం మీరూ తమాషా చూడ్డానికే వెళ్తున్నారా?" వెటకారంగా అంది.

"మరేం చేయమని నీ ఉద్దేశం?" చిరాకుగా అన్నాను.

"ఈ ఊర్లో పోలీస్‌స్టేషన్ అంటూ ఒకటుందిగా... వాళ్ళకు ఫోన్ చేయొచ్చుగా?!" అంది.

"వీలైతే ఆ పని తప్పకుండా చేస్తాను" అంటూ కదిలాను.

దాదాపు ఓ వందమంది ఉన్నారు జనం! ఆ నలుగురు కుర్రాళ్ళూ అటూఇటూ అసహనంగా తిరుగుతున్నారు. వాళ్ళను చూస్తే బాధేసింది. భావిభారత పౌరులు వీరు– బాగా చదువుకొని తమ నింతవాళ్ళని చేసిన తల్లిదండ్రులను చూసుకోవలసినవాళ్ళు– తమ తల్లిదండ్రులకు తలవంపులు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారు.

"ఇదిగో పాపా! ఇంకో అరగంటలో నీవు బయటికి వచ్చావా... సరే! లేకుంటే మేమే తలుపులు బ్రద్దలు కొట్టుకొని వస్తాము. సరిగ్గా అరగంట టైమిస్తున్నాం నీకు!" గట్టిగా అరిచాడు ఆ నల్గురిలో ఒకడు. "అవును... సరిగ్గా అరగంట!" అంటూ మిగిలిన ముగ్గురూ అరిచారు.

జనం నిమిష నిమిషానికీ పెరుగుతున్నారు. ఆ వీధి చివర్లో టెలిఫోన్ బూత్ ఉంది. వెళ్లి పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేద్దామంటే ధైర్యం చాలటం లేదు. ఆ బూత్‌వాడు వీళ్ళ ఫ్రెండయి ఉంటే? లేదా, ఎవడైనా చూసి వాళ్ళకు చెప్పేస్తే... తనను ఊరికే వదుల్తారా వాళ్ళు?

ఏంచేయడానికీ తోచక సతమతమవుతూ నిల్చున్నాను. ఇంటికెళ్లిపోదామనుకుంటే శైలు ప్రశ్నలకు నేను జవాబివ్వలేను. ఏదో ఆశ... సినిమాల్లోలా చివరి నిమిషంలో పోలీసులు వచ్చి వీళ్ళను పట్టుకెళ్లినట్లు- లేదా ఆ అమ్మాయే చకచకా కుంగ్‌ఫూ షాట్లతో రెండునిమిషాల్లో ఆ నల్గురినీ నేలకూల్చినట్లు... అన్నీ ఊహలే! ఏదో జరుగుతుందన్న ఆశ... ఆ అమ్మాయి రక్షింపబడుతుందన్న ఆశ!

అరగంట గడచిపోయింది..!

అంతవరకూ క్రింద కూర్చొనివున్న ఆ నల్గురూ మళ్లీ లేచారు.

"పాపా... నీకిచ్చిన టైము అయిపోయింది! మేమే ఇప్పుడు ఇంట్లోకి ప్రవేశించబోతున్నాం!" అరిచాడు వాళ్ళ లీడరు. అందరూ ఉత్కంఠతో చూస్తున్నారు. ఆ నల్గురి గొంతులు తప్ప ఏ గొంతూ పలకటం లేదు.

ఇంతలో... ఆ ఇంటి తలుపు తెరుచుకుంది. ఆ అమ్మాయి బయటికి వచ్చి నిలబడింది.

చాలా అందంగా ఉన్నదా అమ్మాయి! ఇదివరకు చూసినట్టే ఉంది... ఆ అమ్మాయిని! బహుశా మా ఇంటిమీదుగా కాలేజీకి వెళ్తూంటే చూసి ఉంటానేమో! ఆ అమ్మాయిని చూడగానే నలుగురు కుర్రాళ్ళూ ఈలవేస్తూ చప్పట్లు కొట్టసాగారు.

ఆ అమ్మాయి మెల్లగా నడచుకుంటూ వారివైపు రాసాగింది. వాళ్ళలో ఒకడు ముందుకెళ్లి ఆ అమ్మాయి పైట పట్టుకొని లాగాడు. నేను 'ఉందామా, వెళ్లిపోదామా...' అని ఆలోచిస్తూండగానే-

క్షణంలో జరిగిందా సంఘటన!

ఆ అమ్మాయి పిడికిలిలో దాచివుంచుకొన్న మిరప్పొడి బలంగా ఆ నల్గురి కళ్ళలోకి విసిరింది. మరుక్షణమే తన ఇంటివైపు పరుగెత్తసాగింది.

అందరికీ జరిగింది అర్థమవటానికి ఓ నిమిషం పట్టింది. ఆ నలుగురూ మూల్గుతూ క్రిందకూర్చుని కళ్ళు నులుముకుంటూ "అబ్బా... ఒసేవ్ నిన్నేం చేస్తామో చూడు!" అంటూ అక్కడే గుడ్డివాళ్ళలా తిరగసాగారు.

గుంపులో నుంచి కొంతమంది ఆ అమ్మాయి ఇంటివైపుగా కదలసాగారు. నేనూ కదిలి వీధి చివరికి వచ్చేసరికి- ఆ అమ్మాయి ఆటోలో పోతూ కన్పించింది. ఆమె కిరుప్రక్కలా తల్లిదండ్రులు కాబోలు- కూర్చొనివున్నారు. బహుశా... ఊరికెళ్తున్నారేమో?!

'భగవాన్! వయసులో ఉన్న ఆడపిల్ల ఉండటమే ఆ తల్లిదండ్రులు చేసుకొన్న పాపమా? ఆడపిల్ల అర్ధరాత్రి ఒంటరిగా తిరగవలసిన అవసరం లేదు బాపుజీ... కనీసం పగలైనా నిర్భయంగా నడిచే అవకాశం ఈ సమాజంలో లేదు.'

చెదరిన మనసుతో ఇల్లు చేరాను. శైలూ కళ్ళతోనే ప్రశ్నించింది... ఏం జరిగిందని.

చెప్పాను.

"వాళ్ళకా శిక్ష చాలదండీ!" అన్నది నిరాశగా.

"ముందు ఆ అమ్మాయి వాళ్ళ బారినుంచి తప్పించుకొంది. అందుకు సంతోషించు!" అన్నాను.

"ఈ అమ్మాయి తప్పించుకొంది నిజమే కాని, రేపు ఇంకో అమ్మాయీ ఇలాగే తప్పించుకోవాలిగా?! పైగా, రేపు ఆ అమ్మాయి ఊరి నుంచి తిరిగివస్తే వీళ్ళు ఊరుకుంటారా?"

"నిజమే శైలూ! ఇవన్నీ సమస్యలే... పరిష్కారం లేని సమస్యలు! రేపు ఆ అమ్మాయి ఊరి నుండి తిరిగివస్తే తమ కళ్ళల్లో కారం కొట్టిందన్న పగతో వాళ్ళు ఏమైనా చేయొచ్చు!" అన్నాను బాధగా.

"అందుకే నేను చెప్తున్నది. వాళ్ళు మళ్లీ పరాయి ఆడదాని వైపు కన్నెత్తి చూసే ధైర్యం కూడా లేకుండా చేయాలి. ఒళ్ళు వాచిపోయేలా కొట్టాలి. వాళ్ళకా శిక్ష పడేంతవరకూ నాకు మనశ్శాంతి లేదు."

"ఏం... ద్రౌపదిలా అంతవరకూ జడ ముడివెయ్యవా ఏమిటి?" నవ్వుతూ అన్నాను.

"వెటకారం కాదు. ఇదే నా ఛాలెంజ్... వాళ్ళకు రెండురోజుల్లో శిక్ష పడేలా చేస్తాను."

"ఎలా..?"

"అదే... సస్పెన్స్! నా పథకం ఇదివరకే రెడీ అయింది."

"జాగ్రత్త శైలూ... నీవు ఎలాంటి రిస్కులూ తీసుకోవడం లేదు కదా?!"

"ప్రాణం పోయేంత రిస్కేం తీసుకోవడం లేదులెండి. అయినా చిన్నచిన్న రిస్కులు తీసుకోక తప్పదు!" నిబ్బరంగా అన్నది.

"ప్లీజ్... నీ ప్లానేంటో చెప్పవూ?" బ్రతిమాలుతూ అడిగాను.

"ఊహుఁ... మీరు రేపు క్యాంప్ వెళ్లాలన్నారుగా! ఎల్లుండి మీరొచ్చేసరికి నా ప్లానూ, రిజల్టూ అన్నీ మీకు తెలుస్తాయి."

"దయచేసి ఆ ఆలోచనలన్నీ మానుకో! ఎవరికోసమో మనం ప్రాబ్లమ్స్ కొనితెచ్చుకోవడం బాగా లేదు" హెచ్చరింపుగా అన్నాను. ఆమె ముందు నా భయాలు బయటపెట్టడం ఇష్టం లేకపోయినా– 'తన మొండితనంతో ఏం ప్రాబ్లమ్స్ తెస్తుందో...' అన్న భయం నాకుంది.

"పర్వాలేదు లెండి! నా ప్లాన్ తెలిసింతరువాత అందరూ ఇకపై వీరోచిత కార్యాలకు 'మగతనం' అనడం మాని, 'ఆడతనం' అనడం నేర్చుకొంటారు."

ఆమెతో వాదించి గెలువలేనని తెలుసు. అందుకే మౌనంగా ఉండిపోయాను.

● ● ●

కాలింగ్ బెల్ నొక్కగానే తలుపు తెరచిన శైలుని చూస్తూ "హలో... ఏమైంది నీ ప్లాను?" అన్నాను ఆత్రంగా.

"సక్సెస్..!" అంది నవ్వుతూ.

నాకు నమ్మబుద్ధి కాలేదు.

"వాళ్ళకు శిక్ష పడిందా?" మళ్లీ ప్రశ్నించాను.

"ఆహాఁ..! ఇక జన్మలో వాళ్ళు పరాయి ఆడదాన్ని కన్నెత్తి చూడరు!" అన్నది నవ్వుతూ. ఆ నవ్వులో విజయాన్ని సాధించిన గర్వం కనబడుతోంది.

"శైలూ... ఇవన్నీ నీవే చేశావని వాళ్ళకు తెలుసా?" భయంగా అడిగాను.

"తెలీదు. అసలు నా ప్లాను నాకు, ఇంకొకరికి మాత్రమే తెలుసు. మీకు చెప్తే ఆ ప్లాను తెలిసిన మూడవ వ్యక్తి అవుతారు మీరు!" అన్నది.

"ఆ రెండోవ్యక్తి ఎవరు?"

"సస్పెన్స్..!" అంటూ లోపలికి వెళ్లిపోయింది.

నేను లోపలికి వెళ్ళి స్నానంచేసి రాగానే వేడి ఉప్మా అందించింది. తన ప్లాను గురించి తానే చెప్తుందని ఎదురుచూశాను. అయినా తన నన్నెప్పుడూ సస్పెన్సులో ఉంచడం ఆమెకు మొదట్నుంచీ అలవాటు.

ఇక ఉండబట్టలేక "అసలేం జరిగింది?" అన్నాను తెచ్చిపెట్టుకొన్న సీరియస్‌నెస్‌తో.

నా బాధ అర్థంచేసుకున్నట్లు ముఖం పెట్టి-

"చెప్తాను వినండి! మొన్న అల్లరికి గురైన అమ్మాయి ఉండే వీధిలోనే సి.ఐ. ఇల్లు వుంది. ఆయనకు కాలేజీలో చదివే కూతురుంది. ఆ అమ్మాయి రోజూ మన వీధి ముందుగానే కాలేజీకి వెళ్తూ వుంటుంది. ఆ అమ్మాయిని నిన్నరాత్రంతా నేను కిడ్నాప్ చేసి ఉంచాను."

అదిరిపడ్డాను ఆమె మాటలకు.

"ఏమిటి కిడ్నాపా? నీకేమైనా పిచ్చి పట్టిందా..?" కోపంగా అరిచినట్టే అడిగాను.

"నేను చెప్పేది వినండి. ఆ అమ్మాయి నిన్న సాయంత్రం మనింటి మీదుగా వెళ్తూంటే లోపలికి పిలిచాను. కాసేపు అదీ,ఇదీ మాట్లాడి కాఫీ ఇచ్చాను. ఆ తర్వాత ఆ అమ్మాయికి మొన్న జరిగిన సంఘటన చెప్పి, నా పథకం కూడా చెప్పి ఆమె సహాయం కోరాను. మొదట ఆ అమ్మాయి తటపటాయించింది. తనే వాళ్ళ డాడీతో చెప్పి ఆ అబ్బాయిల్ని తన్నిస్తానంది. నేను అలా వద్దనీ, నా ప్లాను ప్రకారం చేస్తే ఎఫెక్టివ్‌గా ఉంటుందనీ చెప్పాను. నా సలహా ప్రకారం ఆ అమ్మాయి రాత్రంతా మన ఇంట్లోనే ఉండిపోయింది.

రాత్రైనా ఇంటికిరాని కూతురి కోసం సి.ఐ.గారు అన్నిచోట్లా వెతికించారు. ప్రొద్దుటికి ఆ న్యూస్ ఊరంతా తెలిసి సి.ఐ. ఇంటిముందు జనం ప్రోగయ్యారు. నేనూ వాళ్ళలో ఒకరిగా వెళ్లి ముందురోజు జరిగిన సంఘటన అక్కడివాళ్ళకు గుర్తుకుతెచ్చి, ఇది కూడా కుర్రాళ్ళ పనేమోనని సందేహం వెలిబుచ్చాను. ఆ విషయం ఆ నోటా, ఈ నోటా పడి సి.ఐ.గారికి చేరింది. ఆయన పోలీసులను పురమాయిస్తే- పోలీసులు ఆ నలుగురినీ వెదికిపట్టుకొని ఒళ్ళు హూనమయ్యేలా కొట్టారు. ఈరోజు మధ్యాహ్నం ఆ అమ్మాయి వాళ్ళింటి కెళ్లింది."

"మరి, వాళ్ళ నాన్న ఆ అమ్మాయిని ఇంతసేపూ ఎక్కడున్నావని అడిగితే ఏం చెప్తుంది?" ఆతృతతో అన్నాను. నిజానికి నాకిదేదో సినిమా కథ వింటున్నట్లు ఉంది గాని నా ఇంట్లో, నా వీధిలో జరిగిన సంఘటనలా లేదు.

"ఏం చెప్పాలో కూడా నేనే చెప్పాను. కాలేజీ నుండి ఇంటికొస్తూంటే ఎవడో రౌడీవెధవ ఫాలో అయ్యాడని, తలుపు తెరచివున్న మన ఇంట్లో దూరి ఓ రూములో గడియ వేసుకొన్నానని, ఇంతలో విపరీతమైన భయం వల్ల స్పృహ తప్పిందని, మెలకువ రాగానే ఇంటికి వచ్చానని చెప్పమన్నాను. ఆ గది మనం వాడటం లేదని, అందువల్ల ఆమె గదిలో ఉన్న సంగతి నాకు కూడా తెలియదని చెప్పమన్నాను."

"ఎలావుంది నా ప్లాను?" నవ్వుతూ అంది.

ఆమె చేసిన సాహసానికి నేను మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

"కంగ్రాచ్యులేషన్స్... ఐ ఆమ్ ప్రౌడ్ ఆఫ్ యూ!" అంటూ ఆనందంగా చేయి అందించాను.